ప్రజాశక్తి

గురువారం 18 డిసెంబర్ 2025 5

అనంతపురం





డ్వామా కార్యాలయం నిర్వహించిన ఆందోళనలో మాట్లాడుతున్న ఓ.నల్లప్ప

చలి..చలి..!

వాతావరణం ఒక్కసారిగా మారింది. గత 20 రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చి చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరు దాటగానే చలిపంజా విసురుతోంది. ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పటి కప్పేస్తోంది. గడిచిన వారం రోజులుగా చలి ప్రభావం మరింత ఎక్కువ అయ్యింది. సాయంత్రం నుంచి వేకువజాము వరకు జనం 'చలి'గింతలకు గురవుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.





- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- రాత్రిళ్లు 17 డిగ్రీలు నమోదు
- సాయంత్రం నుంచే చలి ప్రారంభం
- వణికిపోతున్న జనం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో చలిప్రభావం ఒక్కసారిగా పెరిగింది. ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. అనూహ్యంగా పడిపోయిన ఉష్ణోగ్రతలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయాయి. మంగళవారం నాడు అనంతపురంలో గరిష్టం 29 కాగా కనిష్టం 17 డిగ్రీలు నమోదు అయ్యింది. రాత్రి నుంచి ఉదయం 7 గంటల వరకు శీతలగాలులు వీస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కప్పుకుంటోంది. రాత్రి 7 గంటలు దాటిన తరువాత చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. చలితీవ్రత పెరగడంతో జనం గజగజ వణకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. ఇప్పటికీ కొన్ని వంకలు, వాగులు నీటితో ప్రవహిస్తున్నాయి. వీటి రిత్యా కూడా చలి తీవ్రత పెరిగిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతూ వస్తున్నాయి. గాలిలో తేమ శాతం పెరగడంతో రాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు తగ్గడం లేదు. దీంతో ప్రజలు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చలితీవ్రతతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. చలి పెరుగుతున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మరింత పెరిగే అవకాశం.. జాగ్రత్తలు పాటించాలి...

ప్రస్తుతం చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. జనవరి మూడవ వారం వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక జబ్బులున్న వారు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చలిగాలులు ఎక్కువగాఉండే సమయంలో ప్రయాణం చేయడం మంచి కాదంటున్నారు. ఒకవేళ ప్రయాణాలు చేసినా చెవులను పూర్తిగా కప్పుకునే ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. చలిని తట్టుకునేలా స్వెట్టర్లు, చేతులకు గ్లౌజులు ధరిస్తే ఉత్తమం అని సూచిస్తున్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసే కుట్ర

- పథకం ప్రకారం కేంద్రం చర్యలు
- పేద రైతు, కూలీల ఆసరాను తొలగిస్తే ఊరుకోం
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓ పథకం ప్రకారం కుట్రల చేస్తూ పేద రైతు, కూలీలకు అండగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పేర్కొన్నారు. ఈ చట్టాన్ని బలహీనం చేసేలా సవరణ తీసుకురావడం పేదల హక్కులపై దాడి చేయడమే అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేలా కేంద్ర ప్రభుత్వం సవరణ తీసుకురావడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం, రైతుసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నాడు ఆందోళన చేపట్టారు. అనంతపురం డ్వామా కార్యాలయం వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాల్లో నల్లప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూపిఎ ప్రభుత్వం 2005లో తెచ్చిన మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో ఎన్‌డిఎ ప్రభుత్వం వికసిత్‌భారత్ గ్రామీణ్ రోజ్గార్ అభిజీత్ మిషన్ గ్రామీణ్ పేరుతో తీసుకొచ్చేందుకు బిల్లు తెచ్చారన్నారు. మహాత్మా గాంధీ పేరును పూర్తిగా తొలగించి పూజ్య బాపూగా మార్చడం గాంధీజీని అవమానించడమే అన్నారు. ఈ సవరణ బిల్లు గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. 100 రోజుల ఉపాధి హామీకి భరోసా లేకుండా చేయడం కాకుండా కేంద్రం నుంచి ఇవ్వాల్సిన నిధుల్లో కోతలు పెడుతూ రాష్ట్రాలకు భారంగా మారుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో మరిన్ని సవరణల పేరుతో చట్టాన్ని నిర్వీర్యం చేయడం ప్రజలపై దాడి చేయడమే అన్నారు. గ్రామీణ నిరుద్యోగాన్ని తగ్గించడం, వలసలను అడ్డుకోవడంలో ఈ చట్టం కీలకపాత్ర పోషిస్తోందని గుర్తు చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట సవరణలు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే పనులే అన్నారు. ఇలాంటి చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి కనీసం 200 రోజులు పని హామీ కల్పించాలన్నారు. కూలీలకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధి పనులకు తగిన నిధులు కేటాయించాలన్నారు. పనుల మంజూరు వేతన చెల్లింపులో ఉన్న ఆలస్యాన్ని నివారించాలన్నారు. అనంతరం డ్వామా పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ముత్తుజ, ప్రకాష్ రెడ్డి, వలి, ఇర్ఫాన్, గోపాల్, లక్ష్మీ నరసమ్మ, ఐద్వా నగర కార్యదర్శి అశ్విని పాల్గొన్నారు.

వేళ్లు లేవని వదిలేశారు..!

అడవిలో నాలుగు రోజుల పసికందు వదిలేసి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



అమ్మఒడి నుంచి లోకానికి పరిచయమైన రోజే ఆ చిన్నారిని కష్టం వెంటాడింది. పుట్టిన గంటల్లోనే అమ్మకు దూరం అయ్యింది. నాన్న స్పర్శను తాకకుండానే ఎవరూ లేని అనాథగా మారింది. ఇంటి మహాలక్ష్మిగా ఎదగాల్సిన బిడ్డ అమానవీయంగా అడవిలోకి చేరింది. అమ్మ పొత్తిళ్లలో ఉండాల్సిన పసిహృదయం ఎముకలు కొరికే చలిలో అడవి చెట్ల మధ్య గుక్కపట్టి ఏడుస్తూ రోజంతా గడిపింది. చేతి వేళ్లులేవన్న కారణంతో అమ్మానాన్నల ప్రేమకు దూరమై అడవిచెంతకు చేరిన నాలుగు రోజుల వయస్సున్న చిన్నారి ఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం గ్రామ సమీపంలోని అటవీ శాఖ అతిథి గహం వద్ద బుధవారం ఉదయం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...



కాలసముద్రం అటవీ ప్రాంతంలో ఉన్న చిన్నారి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కాలసముద్రం అటవీశాఖ అతిథి గృహం వెనుక ఉన్న అటవి ప్రాంతంలో బుధవారం ఉదయం ఓచిన్నారి ఏడుపు అటుగా వెళ్తున్న వారికి విన్పించింది. ఎవరూ లేని నిర్మానుష్య ప్రాంతం నుంచి చిన్నారి ఏడుపు విన్పించడంతో అటుగా వెళ్తున్న వారు అక్కడికి వెళ్లి చూశారు. అక్కడ చెట్ల మధ్యన పసిపాప కన్పించింది. నిర్ఘాంతపోయిన స్థానికులు అక్కడ ఎవరైనా ఉన్నారేమోనని వెతికారు. ఎవరూ కన్పించకపోవడంతో వెంటనే పోలీసులు, ఐసిడిఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్నారిని పరిశీలించగా ఎడమచేతికి నాలుగు వేళ్లు లేనట్లు గుర్తించారు. వెంటనే పాపను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నాలుగు రోజుల క్రితం జన్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం పాప ఆరోగ్య పరిస్థితి బాగా ఉన్నట్లు తెలియజేశారు. ఆడబిడ్డ ఆపై చేతికి వేళ్లు లేవన్న కారణంతోనే చిన్నారిని వదిలేసి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ ఘటనపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు.



కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

జిల్లా అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ల సదస్సులో ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం నాడు కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొని జిల్లా సమగ్రాభివృద్ధిపై ముఖ్యమంత్రికి తెలియజేశారు. అనంతపురం జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే విధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో వందశాతం లక్ష్య సాధనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికలపై కలెక్టర్ ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు.

మార్కెట్ రోడ్డు పరిశీలన

యాడికి : ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్‌లో యాడికి సంత మార్కెట్ రోడ్డు దుస్థితిపై ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డికి అర్జీ అందింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం మండల ఇంజినీర్ వరప్రసాద్, సచివాలయ ఇంజినీర్లు, టిడిపి నాయకులు, విజన్ విద్యా సంస్థల అధినేత విశ్వనాథ్, దామినేని నరసింహచౌదరి, జనసేన నాయకులు జాకీర్ హుస్సేన్‌తో కలిసి సంత మార్కెట్ రోడ్డును పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు.

పెన్షనర్లను నిర్లక్ష్యం చేయొద్దు

ఎన్నికల హామీలు అమలు చేయాలి - రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు రాజ్యాంగం కల్పించిన పెన్షన్ తదితర హక్కులను నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప డిమాండ్ చేశారు. అఖిల భారత పెన్షనర్ల దినోత్సవ వేడుకలు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు లలితకళాపరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణయ్య, సర్వజనాసుపత్రి అనస్థీషియా ప్రొఫెసర్ సుబ్రమణ్యం, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ సుధాకర్, ఏపి ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, నగర అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు అక్బర్, లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ, సామాజిక కార్యకర్త రవికాంత్ రమణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పెన్షన్ పెన్షనర్ల హక్కు అని ఎవరి బిక్షం కాదన్నారు. అలాగే రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన హక్కులు అమలు చేయాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. పాలకులు మారినా ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. జిల్లా ఖజానా శాఖ డిడి రమణయ్య మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను ఆత్మీయంగా సన్మానించారు. వారిలో ఆ సంఘం అధ్యక్షులు పెద్దన్నగౌడ్ కూడా ఉండటంతో అతిథులు, కుటుంబ సభ్యులు, సంఘం నేతలు అందరూ పెద్దన్నగౌడ్ దంపతులను ఆత్మీయంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ప్రభాకర్, జిల్లా కోశాధికారి జి.రామకృష్ణ, గౌరవసలహాదారులు డి.గోవిందరాజులు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మహమ్మద్, సంయుక్త కార్యదర్శులు కిష్టప్ప, మధు, వేణుగోపాల్, సత్యనారాయణ, ఆదిలక్ష్మి, సావిత్రిదేవి, నాగరాజేశ్వరి పాల్గొన్నారు.



సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం నాయకులు, అతిథులు

బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో

కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సోమనాథ్‌నగర్‌లోని బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ నాయకులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శి బాల రంగయ్య, అధ్యక్షులు ఓ.బాబయ్య, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథ్, పద్మనాభచారి, సుభాన్, పి.వెంకటనారాయణ తదితరులు హాజరయ్యారు. ఇటీవల కొచ్చిన్‌లో జరిగిన అఖిల భారత సదస్సులో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన ఎం.రాజశేఖర్‌రెడ్డితో పాటు పెన్‌సనర్లను ఆత్మీయంగా సన్మానించారు.

ప్రమాదమా..కుట్రకోణమా..?

గుత్తిలో దుకాణాల దగ్ధంపై అనుమానాలు



దగ్ధమైన దుకాణం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి పట్టణంలో రెండు రోజులుగా చోటు చేసుకుంటున్న దుకాణాల దగ్ధం ఘటనలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదవశాత్తుగానే ఇవి మంటలకు ఆహుతి అయ్యాయా.? లేక ఏవరైనా కావాలనే వీటికి నిప్పుపెట్టిన కుట్ర కోణం దాగి ఉందా.? అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గుత్తి పట్టణంలోని గాంధీ కూడలి సమీపంలో ఉన్న చిరు వ్యాపారులకు సంబంధించిన దుకాణాలు మంగళ, బుధవారాల్లో దగ్ధం అయ్యాయి. బుధవారం వేకువజామున జొన్న రొట్టెలు విక్రయించుకుంటూ జీవనం సాగించే పార్వతి అనే మహిళకు చెందిన చిరు దుకాణానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో అది పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆమెకు రూ.25వేలు నష్టం వాటిల్లింది. పట్టణంలో చిరువ్యాపారులు నివసించే ప్రాంతంలో వరుస అగ్ని ప్రమాదాలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వ్యాపార సముదాయం పేరుతో పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్ సమీపంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. వాటి నిర్మాణాలు పూర్తి అయినా ఇంత వరకు ప్రారంభం కాలేదు. అదే కాంప్లెక్స్‌ల ముందు గాంధీ చౌక్ వరకూ రోడ్డు పక్కన అనేక మంది తడికలు, వెదురు బొంగు కర్రలతో షెడ్‌లు వేసుకుని చిరువ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రోజున రెండు దుకాణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. బుధవారం మరో దుకాణం మంటల్లో పూర్తిగా కాలిపోయింది. వరుస ఘటనలు జరగడంతో దీని వెనుక ఏదైనా కుట్రకోణం దాగిఉందా అన్న అనుమానాలు బలంగా విన్పిస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చిరు వ్యాపారుల షెడ్లకు కావాలనే నిప్పు పెడుతున్నారనే చర్చ స్థానికుల్లో విన్పిస్తోంది. ఇదే సమయంలో కొందరు యువకులు రాత్రిళ్లు ఆ దుకాణాల్లో విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ మత్తులో దుకాణాలకు నిప్పు పెడుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. కారణం ఏదైనా వరుస ఘటనలతో నిరుపేదలు షాపులు దగ్ధం కావడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయారు. పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ పెంచి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని దుకాణదారులు కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం : విసి

ప్రజాశక్తి-అనంతపురం

రక్తదానం చేయడం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపడడమే అని జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు అభిప్రాయ పడ్డారు. అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్-2), ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపును బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసి హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారికి ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి రక్తదానం చేయాలన్నారు. రక్తదానంపై యువత మూఢనమ్మకాలను విడనాడి దానం చేయాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ రక్తదానాన్ని అత్యంత గొప్ప సేవగా భావించాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నా రెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగం విభాగ అధిపతి, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కళ్యాణి రాధా, డా॥బి.ఓంప్రకాష్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్, వైస్ ఛైర్మన్, డాక్టర్ పి.రమేష్ నారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎస్. రమేష్ పాల్గొన్నారు.



రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌ఛాన్సలర్

ఇళ్ల పట్టాలు ఇవ్వండి: సిపిఎం



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న వి.రామిరెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ పరిధిలోని సీతారాం ఏచూరి కాలనీ, మల్లుస్వరాజ్యం కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు తక్షణమే మంజూరు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ఆవరణంలో కాలనీ వాసులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ మల్లుస్వరాజ్యం, సీతారాం ఏచూరి కాలనీల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. వారికి తక్షణమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. మౌలిక సదుపాయాలు కాలనీలో కల్పించాలన్నారు. తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్, రోడ్లు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ కేశవనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్‌డిఒ సర్వే చేయించి అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

బాదనహాల్ రైల్వేస్టేషన్ ప్రారంభం



రైల్వే స్టేషన్ నుంచి రైలును ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

డి.హీరేహాల్ మండలంలోని బాదనహాల్ వద్ద నూతనంగా నిర్మించిన రైల్వేస్టేషన్ భవనాన్ని బుధవారం నైరుతి రైల్వే గతి శక్తి విభాగం చీఫ్ ప్లానింగ్ మేనేజర్ సంజయ్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ రమేష్ చంద్ర రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అజ్మీర్ నుంచి మైసూర్ వెళ్తున్న ప్రత్యేక రైలు సర్వీసుకు కొబ్బరికాయ కొట్టి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. రాయదుర్గం, బళ్లారి మధ్యలో గతంలో బాదనహాల్, సోమలాపురం, పులకుర్తి, ఓబుళాపురం వద్ద రైల్వే స్టేషన్లు ఉండేవి. దేశమంతటా ఒకే గేజ్ బ్రాడ్ గేజ్ విధానం అమలులోకి రావడంతో ఈ మార్గంలో బాదనహాల్, పులకుర్తి స్టేషన్లు తొలగించారు. దీంతో రాయదుర్గం నుంచి సోమలాపురం నడుమ సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఎలాంటి స్టేషన్ ఉండేది కాదు. ఈ మార్గంలో గూడ్స్ రైళ్లు ఎక్కువగా తిరగడం, ఒకే రైలు మార్గం ఉండటం వల్ల ఎదురుగా మరో రైలు వస్తే అటు సోమలాపురంలో కానీ ఇటు రాయదుర్గంలో కానీ రైలు ఆగాల్సి వచ్చేది. దీంతో రైల్వే అధికారులు గతంలో ఉన్న బాదనహాల్ వద్ద నూతన క్రాసింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా కొత్త స్టేషన్ భవనం, లూప్ లైన్లు నిర్మించారు. ఈ క్రాసింగ్ స్టేషన్ నేడు అధికారికంగా ప్రారంభించడంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకల సంఖ్య పెరగడంతో రైలు వేచి ఉండే సమయం తగ్గుతుంది. కార్యక్రమంలో బళ్లారి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ దాస్, బళ్లారి స్టేషన్ మేనేజర్ కృష్ణమోహన్, గతి శక్తి విభాగం అధికారులు గోపి నాయర్, రవీంద్ర, సోమశేఖర్, సురేష్, అనిల్ కుమార్, ప్రమోద్ కుమార్, శ్రావణ్ కుమార్, లలన్ కుమార్, బాలాజీ, స్టేషన్ మాస్టర్ మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : ఆర్డీవో

ప్రజాశక్తి-యాడికి

ప్రజల సమస్యలపై ఏమాత్రం నిర్లక్ష్యం వద్దని ఆర్డీవో శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక తహ శీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ అర్జీలను క్షుణ్ణంగా విచారణ జరిపి, సంబంధిత నివేదికలను తక్షణమే సమర్పిం చాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా పని చేయాల న్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎఎస్పీ రోహిత్ కుమార్, రూరల్, పట్టణ సిఐలు

రోడ్డు నిబంధనలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రతి పౌరుడు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎఎస్పీ రోహిత్ కుమార్ సూచించారు. పట్టణంతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని మండల కేంద్రాల్లో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో బుధవారం హెల్మెట్ ధారణపై బైక్ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పట్టణం లో ఎఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది చేపట్టిన బైక్ ర్యాలీ రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమై అశోక్ పిల్లర్ వరకూ కొనసాగి తిరిగి రూరల్ స్టేషన్‌కు చేరుకుంది. ఎఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో తల గాయాల వల్ల ప్రాణనష్టం అధికంగా జరుగుతోంద న్నారు. తాడిపత్రి సబ్ డివిజన్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తలకు హెల్మెట్ ధరించక పోవడం వల్లనే చనిపోయారన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు న్నారు. భద్రతే ప్రధాన లక్ష్యంగా వాహనం నడపాలని సూచిం చారు. ర్యాలీలో ఎఎస్పీ రోహిత్ కుమార్, సిఐలు శివ గంగాధర్‌రెడ్డి, ఆరోహన్ రావు, ఎస్ఐలు ధరణి, ఎంవిఐ రాజగోపాల్, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



విత్తన వేరుశనగ పంపిణీ చేసిన జడ్పిటిసి

స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం జడ్పిటిసి ప్రభావతమ్మ, మండల వ్యవసాయ అధికారి గోపాల్ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. జడ్పిటిసి మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకొని విత్తనం పొందాలని సూచిం చారు. ఏవో మాట్లాడుతూ మండలానికి కె-6 450 క్వింటాళ్లు, టిసిజిఎస్-50 క్వింటాళ్ల విత్తనం కేటాయించారన్నారు. క్వింటా రూ. 9,200 కాగా 40 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటా రూ. 5,520 చెల్లించాలన్నారు. అర ఎకరంలోపు ఉంటే బస్తా, ఎకరాకు 2, ఎకరంపై ఉంటే 3 బస్తాలు ఇస్తామన్నారు. ఆర్ఎస్‌కెలో సూక్ష్మ పోషకాలు, జింక్ సల్ఫేట్, బోరాన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ నందకిరణ్, ఆర్ఎస్‌కె సిబ్బంది లిఖిత, సాయి భార్గవ్, నాయకులు బిల్లే గౌడ, పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రాయదుర్గం



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రెవ డాక్టర్ కె.అనంతకుమార్ క్రిస్మస్, బైబిల్ సందేశాన్ని వినిపించారు. జనవరిలో రాయదుర్గంలో జరిగే మూడు రోజుల సువార్త సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పాస్టర్లందరూ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. హాజరైన ప్రతి పాస్టర్‌కు దుస్తులు, సండే స్కూల్ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జయ చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి టి.ప్రేమ్‌కుమార్, కోశాధికారి ఎం.పీటర్, సహాయ కార్యదర్శి ఎం.పౌలు, పాస్టర్లు, బేతనీయ బాప్టిస్ట్ చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కుటుంబంపై ఆరోపణలు తగదు' : టిడిపి

ప్రజాశక్తి-శింగనమల

స్థానిక శ్రీదుర్గా ఆంజనేయస్వామి ఆలయ విషయంలో రాజకీయ కుట్రలు తగదని టిడిపి నాయ కులు పేర్కొన్నారు. ఈ ఆలయానికి సంబంధించి ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో బుధవారం ఆలయం వద్ద టిడిపి నాయకులు, ప్రజలు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కొంత కాలంగా ఆలయ పూజారి రమణాచారి వ్యవహారం భక్తుల మనోభావాలను దెబ్బ తీసేలా ఉందన్నారు. పూజారి వ్యవహారాలను పక్కదారి పట్టించేందుకే వైసిపి నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఆమె తల్లి బండారు లీలావతిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆలయాల్లో రాజకీయాలు తగదని, అయితే పూజారుల పేరుతో జరిగే తప్పులను ప్రశ్నించడం నేరం కాదని, తప్పు చేసిన వారిపై చర్యలు తప్ప వన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దండు శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు, చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ సత్యనారాయణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, చలమయ్య, రంగారెడ్డి, సత్యనారాయణ, బండి పరశురాముడు, రాగే పరశు రాముడు, డీలర్ శివ బాలకృష్ణ, పట్నం నగేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-నార్పల

పేదల గుడిసెలను తొలగించడంతో బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో పేదలు స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. నియోజవర్గ సిపిఐ కార్యదర్శి టి.నారాయణస్వామి మాట్లాడుతూ నార్పల క్రాసింగ్ సమీపంలో నిరు పేదలు గుడిసెలు వేసుకోగా అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ మంగళ వారం అర్ధరాత్రి తొలగించడం దుర్మార్గమన్నారు. గతంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆదేశించినా నేటికీ అధికారులు అనర్హులను తొలగించలేదన్నారు. అనంతరం వారు డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, సుధాకర్, లలితమ్మ, పెద్ద పెద్దయ్య, నాగరాజు, నారాయణప్ప, సూరి, ఉమాపతి, సంజీవరాయుడు, సుందరమ్మ, శివమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎఐ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-శెట్టూరు

విద్యార్థినుల కోసం బుధవారం కళ్యాణదుర్గం పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలత అధ్యక్షతన సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎఐపై నైపుణ్యం పెంచుకోవడం ద్వారా ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకోవచ్చు అన్నారు. గ్రామీ ణ స్థాయి విద్యార్థినులకు నూతన సాంకేతికతను అందివ్వటానికి ముందుకొచ్చిన గుంతకల్లు ఎస్‌కెపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సూర్యనాగిరెడ్డి మాట్లాడుతూ ఎఐ నైపుణ్యం ఉన్న వారికి భవిష్యత్తులో ఆరోగ్య, వ్యవసాయ, రవాణా, తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఎఐ సర్టిఫికెట్ కోర్స్‌కు హాజరైన విద్యార్థినులు



గుంతకల్లు, శింగనమలలో బిల్లు ప్రతులను దహనం చేస్తున్న ఎపి వ్యకాసం, సిపిఎం నాయకులు

'ఉపాధి' నిర్వీర్యంలో భాగమే పేరు మార్పు

ప్రజాశక్తి-గుంతకల్లు

ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి పార్లమెంటులో బిల్లు పెట్టడం దుర్మార్గమైన చర్య అని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మండిపడ్డారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆ బిల్లు ప్రతులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే కంకణం కట్టుకుందన్నారు. గాంధీపై ద్వేషంతో పేరు మార్చిందన్నారు. ఉపాధి పని దినాలు 125 రోజులు పెంచుతున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా వాస్తవంగా ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీసేలా బిల్లు ఉందన్నారు. ఉపాధి హామీ కొత్త బిల్లును చట్టం చేయడాన్ని ఎపి ఎంపీలందరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు జె.రమేష్‌బాబు, సాకే నాగరాజు, కసాపురం రమేష్, సురేంద్రబాబు, విరూపాక్షి, రామునాయక్, బాషా, సూరి, సుధాకర్, డేనియల్, రాము, రాజా, షకీరా, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ఉపాధి హామీ చట్టం పేరును మారుస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎపి వ్యకాసం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ తేజోష్నకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి ఆధ్వర్యంలో బిల్లు ప్రతులను స్థానిక వ్యకాసం కార్యాలయం వద్ద దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, దస్తగిరి, సాయికుమార్, ఆంజనేయులు, ఎర్రిస్వామి, షాషు, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ఎపి వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, సుంకన్న ఆధ్వర్యంలో శింగనమలలో కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రతులను దహనం చేశారు. కార్యమ్రకంలో నాయకులు మునెప్ప, వెంకట్రాముడు, నాగరాజు, కేశన్న, గోవిందు, పెద్ద కేశన్న పాల్గొన్నారు.

వ్యకాసం, సిపిఎం ఆధ్వర్యంలో బిల్లు ప్రతులు దహనం



పామిడిలో ఎంపిడిఒ తేజోష్నకు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

వైసిపిలో బలమైన బిసి నాయకులు బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో ముఖ్య నేత, మాజీ ఎంపిటిసి, కురుబ సంఘం నాయకుడు దొణస్వామితో పాటు వేపులపర్తి ఎంపిటిసి నాగభూషణం, కనుకూరు రవి, పోలేపల్లి వడ్డే తిమ్మప్ప, పొబ్బర్లపల్లి ఎ.ఆనంద్‌ల కు పట్టణంలోని ప్రజావేదికలో ఎమ్మెల్యే సురేంద్రబాబు టిడిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు వారు వందలాది బైక్‌లతో ర్యాలీగా స్థానిక కంబదూరు బైపాస్ నుంచి కనకదాసు విగ్రహం మీదుగా ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వీరు టిడిపిలో చేరడం చర్చనీయాంశమైంది.

ఆర్మీకి ఎంపికైన వారికి ఎమ్మెల్యే అభినందనలు

దేశానికి సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలి పారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామం వద్ద ఉన్న ఎస్ఎల్ఎన్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొంది ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికైన 23 మందిని బుధవారం ఎమ్మెల్యే పట్టణంలోని ప్రజావేదిక వద్ద సన్మానించి అభినందించారు. ఆర్మీ ఉద్యోగాలకు నవీన్‌కుమార్, పురంధర్, అజయ్, జగన్, ఫణికుమార్, చందు, తదితరులు ఎంపికయ్యారు. దేశసేవకు సిద్ధమైన మీకు ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.



వైసిపి నాయకులకు టిడిపి కండువా వేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాయదుర్గం శాఖ అధ్యక్షులు ఈ.రామాంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కార్యాలయంలో బుధవారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ అధ్యక్షులు రామన్న ఆధ్వర్యంలో 'నకారా' విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడు తూ ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిమితిని రూ. 2 లక్షలకు పైగా పెంచాలని, సకాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, 12వ వేతన సవరణ ఏర్పాటు చేయాలని, అన్ని రైళ్లలో రాయితీ కల్పించాలని కోరారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎస్‌బిఐ మేనేజర్ అమోల్, సబ్ ట్రెజరీ అధికారి ఆదిలక్ష్మి హాజరయ్యారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు మల్లేష్, వసంత్‌కుమార్, యూసఫ్, తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సివి.రమణ, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : పెన్షనర్లను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. పట్టణం లోని పెన్షనర్ల భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్స వం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, సహాయ కోశాధికారి సరస్వతీ మాట్లా డుతూ పెన్షనర్లను విభజించడం, ఆర్టికల్-14ను ఉల్లగించడమే అన్నారు. ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

గుత్తి : జాతీయ పెన్షనర్ల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని రాష్ట్ర పెన్షనర్ల సం ఘం భవనంలో విశ్రాంత ఉద్యోగులను సన్మానిం చారు. ముందుగా పెన్షనర్లు నకారా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా ఉప ఖాజానాధికారి సురేష్‌బాబు, విశ్రాంత వైద్యాధికా రులు డాక్టర్ కృష్ణగోపాల్ రెడ్డి, డాక్టర్ ఎం.రంగన్న హాజరై మాట్లా డారు. అనంతరం 70 ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగులు ఎం. రామ్మోహన్, హాసన్‌అహ్మద్, విజయ భాస్కర్‌రెడ్డి, శ్యామ్ డానియల్, రాజేం ద్రప్రసాద్, ఆదినారాయణ, పెన్షనర్ల భవనంలో పనిచేసే అటెండర్ లక్ష్మిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు కె.అబూబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కోశాధికారి జన్నే కుళ్లాయిబాబు, నారాయణరెడ్డి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.



రాయదుర్గంలో సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం నాయకులు



అంగన్వాడీ సిబ్బందికి సెల్‌ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే జయరామ్

అంగన్వాడీలకు సెల్‌ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి-వజ్రకరూరు

నియోజకవర్గంలోని 3 మండలాల్లో పని చేస్తున్న అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లకు బుధవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ గుంతకల్లు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన 279 నూతన సెల్‌ఫోన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు పాత మొబైల్ ఫోన్లతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారన్నారు. వారి సమస్యను గుర్తించిన సిఎం చంద్రబాబు నూతన సాంకేతికత ఉన్న కొత్త మొబైల్ ఫోన్లను అందజేశారన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, డాక్టర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మోడల్ పేపర్ల అందజేసిన దాతలు, యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ మోడల్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి-బెళుగుప్ప

దాతల సహకారంతో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.అర్జున్, గౌరవాధ్యక్షులు యు.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ పేపర్లు అందజేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బుధవారం ముఖ్యఅతిథి ఎంఇఒ-2 హరికృష్ణ, హెచ్ఎం వెంకట ప్రసాద్ యుటిఎఫ్ మోడల్ పేపర్లను ఆవిష్కరించారు. ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఓబుళపతి, శివరుద్రప్ప, మహమ్మద్ రఫీ, మారుతి ప్రసాద్ సహకారంతో మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉన్న పదో తరగతి విద్యార్థులు 400 మందికి రూ. 32 వేల విలువ చేసే యుటిఎఫ్ మోడల్ పేపర్లను అందజేయడం స్ఫూర్తిదాయకం అన్నారు. యుటిఎఫ్ నాయకులు అర్జున్ మాట్లాడుతూ ఐదేళ్లుగా మండల వ్యాప్తంగా విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ పేపర్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఓబుళపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రమేష్ తండ్రికి నగదు అందజేస్తున్న డీఎస్పీ

కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి-వజ్రకరూరు

అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టే బుల్‌కు గుంతకల్లు సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులు, సిబ్బంది ఆర్థికసాయం అందజేశారు. కానిస్టేబుల్ ఉప్పర రమేష్ వైద్య ఖర్చుల కోసం బుధవారం వారు డీఎస్పీ ఎ.శ్రీనివాసులు చేతుల మీదుగా రమేష్ తండ్రికి రూ. 2.50 లక్షలు అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ రమేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారన్నారు. అతనికి కిడ్నీ మార్పిడి కోసం సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు కానిస్టేబుళ్లు తమవంతుగా ఆర్థిక సాయం అందించారన్నారు. కార్యక్రమంలో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై కేసులు తొలగించే వరకూ పోరాటం

ప్రజాశక్తి-శెట్టూరు

దళితులపై నమోదు చేసిన బూటకపు కేసులను తొలగించే వరకూ పోరాడుతామని ఎస్సీ, ఎస్టీ జెఎసి తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మాకొడికి గ్రామంలో, రాయదుర్గం మండలంలోని రాయంపల్లి గ్రామంలో దళితులపై నమోదు చేసిన కౌంటర్ కేసులను వెంటనే తొలగించాలని, లేనిచో బాధితుల పక్షాన ప్రజా సంఘాలతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు గంగాధర్, క్రిష్టప్ప, శ్రీరాములు, రామాంజనేయులు పాల్గొన్నారు.

21న వైసిపి రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నార్పల

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21వ తేదీ స్థానిక ఎస్‌వి ఫంక్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్, రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో శైలజనాథ్ మాట్లాడుతూ రక్తదాన శిబి రంలో జగనన్న సైనికులందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. రక్తదాతలు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్, ప్రభుదాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజనాథ్

నేరాలు ఘోరాలు

టైరు ఊడి ట్రాక్టర్ బోల్తా.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

ట్రాక్టర్ టైరు ఊడిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన ఆదిరెడ్డి, మద్దిలేటి, ఓబులేసు, నాగరాజు ట్రాక్టర్‌లో గుత్తి వైపు వస్తుండగా పట్టణంలోని కర్నూలు రోడ్డులో రామానుజన్ పాఠశాల ఎదురుగా ఉన్నఫళంగా ట్రాక్టర్ ముందు టైరు ఊడిపోయింది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌ను ఎక్కి అటు వైపు రోడ్డు పైకి దూసుకెళ్లడంతో ట్రాలీ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆ నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఆ సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహ నాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఇద్దరిని అనంతపురం తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ హరినాథ్ తెలిపారు. వివరాలు.. కర్నాటకలోని వైఎన్ఎస్ కోటకు చెందిన హనుమంతరాయుడు ఎర్రంపల్లికి చెందిన మాల చంద్రకళతో సన్నిహితంగా ఉండేవాడు. దీంతో ఆమె తల్లి మాల హంపమ్మ అలియాస్ అంబక్క, సోదరుడు మాల మహేష్ నవంబర్ 7వ తేదీ రాత్రి హనుమంతరాయుడు చేతులు, కాళ్లు కట్టేసి దాడి చేశారు. అదేరోజు స్వగ్రామం వెళ్లిన హనుమంత రాయుడు మరుసటిరోజు మృతిచెందాడు. అతడి బంధువులు, కర్నాటక పోలీసుల సమాచారం మేరకు హంపమ్మ, మహేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు మహేష్, హంపమ్మలను బుధవారం ఎర్రంపల్లిలో వారి ఇంటి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

చీడపీడల నియంత్రణతో అధిక దిగుబడి : జెడిఎ

ప్రజాశక్తి-గుత్తి

పంటల సాగులో చీడపీడల నియంత్రణ చర్యలు చేపట్టడం వల్ల రైతులు అధిక దిగబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డిపల్లి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో గుత్తి వ్యవ సాయ సబ్ డివిజన్‌లోని యాడికి, పామిడి, గుత్తి, పెద్దవడుగూరు, శింగనమల మండలాల్లోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి రబి పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. జెడిఎ మాట్లాడుతూ నేల పరీక్ష, పంటల పోషక నిర్వహణ, సానుకూల పద్ధతులతో రైతులు మంచి ఫలితాలు సాధించవచ్చ న్నారు. రైతులకు సాంకేతికతను అందించడంలో ఆర్ఎస్‌కె సిబ్బంది ప్రధాన పాత్ర పోషిస్తున్నార న్నారు. కార్యక్రమంలో ఎడిఎ ఎం.వెంకటరాముడు, ఎఇలు ముస్తాక్‌అహ్మద్, మహబూబ్‌బాషా, అన్వేష్, కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్.మల్లేశ్వరి, డాక్టర్ జి.శశికళ, డాక్టర్ బికె.కిషోర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌బీమాపై ప్రచారం

ప్రజాశక్తి-రాయదుర్గం



అవగాహన ర్యాలీ చేపట్టిన పోస్టల్ ఉద్యోగులు

తపాలా శాఖ ప్రవేశపెట్టిన బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ కోనేటి అమర్‌నాథ్ సూచించారు. పట్టణంలోని సంతాన వేణు గోపాలస్వామి ఆలయ ఆవరణలో బుధవారం రాయదుర్గం సబ్ డివిజన్ పోస్టల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవిత బీమా, గ్రామీణ జీవిత బీమా పథకాలు ప్రజలకు ఎంతగానో రక్షణ కల్పిస్తాయన్నారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ అందించే బీమా పథకాలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. బీమా సంకల్ప 2.0 ప్రచార వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 18, 19, 20 తేదీల్లో పోస్టల్ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం వీధుల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ డివిజన ఇన్‌స్పెక్టర్ పి.మహేష్, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, పోస్ట్‌మ్యాన్లు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-పుట్లూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెంచాలని ఎంపి డిఒ అలివేలమ్మ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఈకేవైసీ చేయడంలో మండలం చాలా వెనుకబడి ఉందని, త్వరగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ తులసిప్రసాద్, ఎఫ్ఎలు, టిఎలు, బిఎఫ్‌టిలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో గుత్తివాసుల ప్రతిభ

ప్రజాశక్తి-గుత్తి



షేక్ హాజీ




కెఎస్.కృష్ణ

రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుత్తికి చెందిన అథ్లెట్లు ప్రతిభ చాటారు. ఈ నెల 13, 14 తేదీల్లో బాపట్లలో జరిగిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది పాల్గొన్నారు. అందులో గుత్తికి చెందిన రైల్వే ఉద్యోగి కెఎస్.కృష్ణ పరుగు పందెంలో బంగారు పతతం సాధించారు. అలాగే గుత్తి పట్టణంలోని కోట జడ్పీ ఉన్నత పాఠశాల పిఇటి షేక్ హాజీ మలంగ్ 5 కి.మీ నడక పందెంలో రజత పతకం, జావెలిన్ త్రోలో కాంస్య పతకాలు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి-గుత్తి

ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి ఎన్.రాజశేఖర్ సూచించారు. పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని బుధవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీల బ్యారెక్‌లు, వంట, స్టోర్ గది, మరుగుదొడ్లను పరిశీలిం చారు. కాసేపు ఖైదీలతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నేరాలు చేసి జైలుకు వస్తే కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఇకపై ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ప్రశాతం జీవనం గడపాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాది విసి.గంగాధర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న రాజశేఖర్